RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 175

మంగళవారం
జూన్ 06, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

2లో..







# ఫేషియల్ అటెండెన్స్‌పై విముఖత

- ☐ పంచాయతీ కార్యదర్శుల హాజరుకు యాప్
- ☐ ఏ శాఖలో లేనిది తమకే ఎందుకు? అని ప్రశ్నలు
- ☐ మూకుమ్మడిగా సెలవు పెట్టేందుకు సెక్రెటరీల ఆలోచన!
- ☐ అప్పుల ఊబిలో చిక్కుకుని.. సొంతంగా రూ.5 లక్షల వరకు ఖర్చు
- ☐ జీపీల నిర్వహణకు పెట్టిన డబ్బులు ఇప్పించాలని అధికారులకు రిక్వెస్టు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

రాష్ట్రంలో పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రామ అధికారులుగా ఉన్న పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి కత్తులు వేలాడుతున్నాయి.! పంచాయతీ కార్యదర్శుల రోజువారీ హాజరుకు 'ఫేషియల్ రికగ్నిషన్' యాప్ ద్వారా నమోదుకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేయగా, సెక్రెటరీల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. ఏ శాఖలో లేనిది తమ శాఖకు ప్రత్యేకంగా యాప్ ఎందుకు? తీసుకొచ్చారని వారు ప్రశ్నిస్తున్నారు. గత 5 రోజులుగా రాష్ట్రంలోని 12,751 గ్రామపంచాయతీలకు ఎవరూ 'ఫేషియల్' అటెండెన్స్ వేయకుండా పూర్తిస్థాయి ఐక్యతతో నిరసన తెలుపుతున్నారు. అయితే, సెక్రెటరీలు రెగ్యులర్‌గా గ్రామాలలో విధులకు హాజరవుతూ అనేక సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో..యాప్ ద్వారా అటెండెన్స్ వేయని వారికి సీఎల్‌గా పరిగణించవలసిందిగా పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్.. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆ ఆదేశాలు అలాగే కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ పంచాయతీ కార్యదర్శులు అందరూ మూకుమ్మడిగా సెలవు పెట్టే ఆలోచనలో ఉన్నట్టుగా తెలిసింది.

**- సెక్రెటరీలపై 'ఫైనాన్షియల్' బర్డెన్**

గ్రామాలకు అభివృద్ధికి సంబంధించిన గ్రాంట్లు రాక జీపీలు ఆర్థికంగా చతికిల పడ్డాయి. ఏదైనా అత్యవసర పని ఉంటే పంచాయతీ కార్యదర్శులే తమ జేబుల్లోంచి డబ్బు ఖర్చు పెట్టి మరమ్మతులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర సర్కారు ఫండ్స్ మంజూరు చేయకపోవడం, గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామ పంచాయతీల పాలన కార్యదర్శులకు

మిగతా 4వ పేజీలో..

## 48 గంటల్లో 21 సార్లు కంపించిన భూమి.



**వేద న్యూస్,** పొరుగుదేశం పాకిస్థాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. ఆ దేశంలో అతిపెద్ద నగరమైన కరాచీలో 48 గంటల్లో ఏకంగా 20కిపైగా భూ ప్రకంపనలు నమోదవడం

2

### ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

## మావోయిస్టు మృతి



**వేద న్యూస్, రాయ్‌పూర్ :**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మళ్లీ తుపాకులు గర్జించాయి. బుల్లెట్ల వర్షం కురిసింది. మావోయిస్టు కీల క నేత హిడ్మా లక్ష్యంగా భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. నేషనల్ పార్కు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య భీకరమైన కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందారు. ఘటనాస్థలంలో ఆటోమేటిక్ ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల కోసం బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు సమాచారం.



## స్థానిక సంస్థల ఎన్నికలపై క్లారిటీ

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(గురువారం) కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రిమండలితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. కేబినెట్‌లో ప్రధానంగా లోకల్ బాడీ ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈనెల చివరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే 300 పేజీల ఎన్డీఎస్‌ఏ రిపోర్ట్, 150 పేజీల విజిలెన్స్ రిపోర్ట్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇచ్చారు. రిపోర్ట్‌పై మంత్రుల అభిప్రాయాలను సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకున్నారు. ఏపీలో పరిశ్రామికాభివృద్ధికి వివిధ జిల్లాల్లో ప్రభుత్వ భూములను కి బదిలీ చేస్తూ కేబినెట్

మిగతా 4వ పేజీలో..




## సస్పెన్షన్ @ మిల్స్ కాలనీ!?

- ఈ పీఎస్ హిస్టరీలో క్లీన్ ఆఫీసర్స్ అరుదు!
- ఇక్కడి నుంచి వెళ్లిన వారిలో మెజారిటీ సస్పెండయిన వారే!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్:**

అది పేరుకే పోలీస్ స్టేషన్..కానీ అక్కడ జరిగేవి అన్నీ సెటిల్‌మెంట్లే..! అందుకే ఎంత పెద్ద క్రైమ్ చేసినా...అక్కడికి కేసు వెళ్లింది అంటే చాలు.. టెన్షన్ ఫ్రీ అయిపోతారు.. ప్రతి క్రైమ్‌కు అక్కడ ఒక రేటు ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఇంతకీ ఆ పీఎస్ ఎక్కడ? అని ఆలోచిస్తున్నారా..? సదరు పీఎస్ ఎక్కడో కాదండోయ్..వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏ.జే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్.. ఆ పోలీస్ స్టేషన్‌లో గత కొన్ని

మిగతా 4వ పేజీలో..

### ప్రభాకర్ రావు

## విచారణపై సస్పెన్స్

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణపై సస్పెన్స్ కొనసాగుతోంది. గురువారం ఆయన సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే దీనిపై సింగిల్ ఎంట్రీ పర్మిట్ ఇంకా తీసుకోలేదని దర్యాప్తు అధికారులు అంటున్నారు. సింగిల్ ఎంట్రీ పర్మిట్ తీసుకుంటే మూడు రోజులలోపు ప్రభాకర్ రావు విచారణకు హాజరు కావాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు

మిగతా 4వ పేజీలో..

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**- కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**




పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సంగెం మండలం గవిచర్లలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మహిళలు, రైతులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ దినోత్స

మిగతా 4వ పేజీలో..

## త్వరలోనే బాలికా రక్షక టీం

**వేద న్యూస్, హైదరాబాద్ :**

మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నో కొత్త ఆలోచనలకు మేధో మథన సదస్సు ప్రాణం పోసిందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన మేధో మథన సదస్సు ముగింపు సభలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మేధో మథన సదస్సు విజయవంతం అయ్యిందని.. ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాల్లో ఇలాంటి సదస్సులు నిర్వహించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చున్నారు. ఈ సదస్సులో మహిళా శిశు సంక్షేమంపై పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తమ విలువైన సలహాలు ఇచ్చారని అన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం నిపుణులతో ఒక

మిగతా 4వ పేజీలో..



వేద న్యూస్



# కోర్టు ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ కోర్టు ప్రాంగణంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వేణు,సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి సుజయ్ కుమార్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పవన్ కుమార్ ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడుతూ,ప్రతి ఇంటికి ఒక మొక్కను నాటీ, దానినిపరిరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు,మహిళా న్యాయవాదులు,జూనియర్ న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ సోసియేషన్ జనరల్ సెక్రెటరీ అలుగుబెల్లి భూపతి రెడ్డి,ట్రెజరర్ గొడ్డేటి సాయికుమార్,కంభం శ్రీనివాస్ రెడ్డి,ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి, గోదాల వెంకట రెడ్డి,కర్ణం లింగయ్య,కొంక వెంకన్న,ధూపాటి మట్టయ్య,బాణాల ఉమాశంకర్, సి హెచ్ వి డి ప్రసాద్,బివి రమణ,పగిడి ఆంజనేయులు, దేవులపల్లి శ్రీనివాసచారి, బొంగర్ల నాగరాజు,వీర్ల వినోద్,పెద్దమాం కిరణ్, అలుగుబెల్లిస్వరాజ్యం, అనంతుల గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

నూతన ఈవోగా

# సత్యనారాయణ



**వేద న్యూస్, మడికొండ :**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన మెట్టుగుట్టపై గల శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానం, మడికొండ, కార్యనిర్వహణాధికారి గా ఎస్ సత్యనారాయణ గురువారం బాధ్యతలను స్వీకరించారు. కాళేశ్వరం జోన్ నుండి భద్రాద్రి కొత్తగూడెం జోన్ కి జీవో నెంబర్ 317 ప్రకారం కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు పరిశీలకులు, వరంగల్ విభాగం డి. అనిల్ సమక్షంలో ప్రస్తుతం ఉన్న కార్యనిర్వహణ అధికారి కే. శేషు భారతి, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. సత్యనారాయణ కు బాధ్యతలను అప్పగించారు.

‘రైతు భరోసా’

# వెంటనే ఇవ్వాలి

– తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కారదర్శి రాము

**వేద న్యూస్, జమ్మికుంట:**

వానాకాలం సీజన్‌కు ‘రైతు భరోసా’ నిధులను వెంటనే రైతుల ఖాతాలో జమచేయాలని తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా సహాయ కారదర్శి చెల్పూరి రాము డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇల్లందకుంట మండలకేంద్రంలో మీడియాతో మాట్లాడారు. ఈ సంవత్సరం ముందస్తు వర్షాలు పడటంతో వానాకాలం పంటలు వేయడం ప్రారంభించారని, రైతులకు పెట్టుబడికి డబ్బులు ఇప్పుడు అవసరం కాబట్టి తక్షణం రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. ఈ పథకాన్ని 2024 వానాకాలం సీజన్‌లో ఇవ్వలేదని గుర్తుచేశారు. ఎకరానికి రూ.7,500 ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6,000లకు తగ్గించిందని వెల్లడించారు. 2025 యాసంగి సీజన్‌లో 53.4 లక్షల మందికి రూ.4.366ల కోట్లు 72 లక్షల ఎకరాలకు మాత్రమే చెల్లించారని పేర్కొన్నారు. ఆ తర్వాత చెల్లింపులు చేయలేదని స్పష్టం చేశారు. 2025- 26 సంవత్సరానికి వానకాలం సీజన్ ప్రారంభమౌతున్న నేపథ్యంలో..ఈ వానకాలానికి 70 లక్షల మంది రైతులకు రూ.7,320 కోట్లు రైతు భరోసా కింద చెల్లించాలని పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

– కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

**వేద న్యూస్, వరంగల్:**




పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5)ను పురస్కరించుకొని బల్దియా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా బృందాలకు (ఎస్ హెచ్ జీ) మొక్కలు నాటడం పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిర క్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్ హెచ్ జీ బృందాలు ఇట్టి శిక్షణను సమర్థవంతం గా వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ వో లు రమేష్, లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ అనూహ, సిఓలు శ్రీలత, సుజాత మెప్మా ఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

# తనుగులలో రెవెన్యూ సదస్సు



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామంలో గురువారం ‘భూభారతి’ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మొత్తం 123 దరఖాస్తులు వివిధ భూ సమస్యలపై వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి, నాయబ్ తహశీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్లు సత్యనారాయణ, శంకర్, ఎంపీఎస్‌వో, సర్వేయర్ ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# 48 గంటల్లో 21 సార్లు కంపించిన భూమి

మొదటి పేజీ తరువాయి

ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం రాత్రి నుంచి 48 గంటల్లో దాదాపు 21సార్లు భూమి కంపించింది. ఈ ప్రకంపనల తీవ్రత రిక్టరు స్కేలుపై 2.1 నుంచి 3.6 మధ్య ఉన్నాయి. ఆదివారం రాత్రి 3.6 తీవ్రతతో సంభవించిన భూకంపం అత్యంత శక్తివంతమైందిగా అక్కడి అధికారులు తెలిపారు. ఈ ప్రకంపనల ధాటికి మాలిర్ జిల్లా జైలు గోడ పాక్షికంగా కూలిపోయింది. దీంతో దాదాపు 216 మంది ఖైదీలు పరారయ్యారు. ఇలా కొన్ని గంటల వ్యవధిలోనే వరుసగా స్వల్ప స్థాయిలో భూమి కంపిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

**వేద న్యూస్,దామరచర్ల :**

ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా కొట్టేవా కంపెనీ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. పర్యావరణం హితం కోసం వ్యవసాయం చేసే రైతులు పురుగు మందులు పిచికారి చేసేటప్పుడు తగిన విధంగా జాగ్రత్తలు పాటించాలని పంట పండించే రైతు ఆహారం వినియోగించే వినియోగదారుడు అందరూ సంక్షేమంగా ఉండాలన్నదే కొట్టేవా అగ్రి సైన్స్ కంపెనీ వారి ముఖ్య ఉద్దేశం అని టి బిఎం అన్వర్ భాష ఎండిఓ రవివర్మ అన్నారు.గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకొని కొట్టేవా అగ్రి సైన్స్ కంపెనీవారు దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామ రైతులకు రైతు వేదిక నందు పురుగు మందుల వాడకం పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంపై ముఖ్యంగా వాడుతున్న మందులు రెడ్ లేబుల్ ఎల్లో లేబుల్ బ్లూ లేబుల్ గ్రీన్ లేబుల్ మందులు వ్యవసాయంపై పిచ్చి కారు చేసేటప్పుడు శరీరం పై భాగాన పడకుండా తగిన విధంగా రక్షకవచం మొహానికి మాస్క్ వాడాలని ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు సాయంత్రం 3 గంటల నుండి 5 గంటలకు మందులు పిచికారి చేయాలన్నారు. ప్రధానంగా గ్రీన్ లేబుల్ వాడినట్లయితే పర్యావరణం పై ప్రభావం పడదని అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు.పైన పేర్కొనబడిన విధంగా రైతులు పురుగు మందులు వాడుతున్నప్పుడు పలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకుని పంట దిగుబడిని పెంచుకొని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రజలు రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పర్యావరణం బాగుంటేనే వాతావరణం బాగుంటుందని అందులో గాలి నీరు నేల కలుషితం కాకుండా అందరి ఆరోగ్యాలు




బాగుంటాయన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ పరంగి రాంబాబు పాల్గొనగా ఆయనను కొట్టేవా కంపెనీ వారు శాలువతో సన్మానం చేశారు.అనంతరం రైతుల సమక్షంలో మొక్కను నాటించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



– పాల్గొన్న ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, ముత్యాలమ్మ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామం మీద,గ్రామ ప్రజల మీద ఎల్లప్పుడూ ముత్యాలమ్మ మరియు బొడ్రాయి దేవతల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని,వీర్లపాలెం ప్రజల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్తెమ్మ ఆశీస్సులు గ్రామ ప్రజలందరికీ ఉండాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో జరిగిన బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం లో ఎమ్మెల్యే బిఎల్‌ఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని కొత్తపల్లి వారి సత్తెమ్మ దేవతను దర్శనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన సత్తెమ్మని దర్శించుకోవడం మహాభాగ్యం అని,సత్తెమ్మ ఆశీస్సులు కొత్తపల్లి వంశస్తులతో పాటు గ్రామ ప్రజలపై కూడా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వంశస్థులతో పాటు,వీర్లపాలెం గ్రామ మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ




**వేద న్యూస్, కాజీపేట :**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పీ.వెంకన్న, ట్రాఫిక్ ఎస్ఐలు రావెళ్ల రామారావు, కనక చంద్రం, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై క్లారిటీ

మొదటి పేజీ తరువాయి

నిర్ణయం తీసుకుంది. స్పెషల్ ఎక్సైజ్ సెస్ అమలు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. విద్యాశాఖలో మరో డైరెక్టర్ నియామకం చేపట్టాలని మంత్రి మండలి నిర్ణయించింది. విద్యుత్ శాఖలో 300 పోస్టుల క్రియేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జహీరాబాద్ ఇండస్ట్రీయల్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వర్షాకాలం నేపథ్యంలో జూన్, జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణ సాధ్యాసాధ్యాలపై చర్చించారు. మహిళా సంఘాలకు బీమా నిధుల విడుదలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ములుగులో పామాయిల్ ఫ్యాక్టరీకి 12 ఎకరాల భూమి కేటాయిస్తూ కేబినెట్ ఆమోదించింది. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దివంగత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నామకరణం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీ కార్యకలాపాలు ప్రారంభించమన్నారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కేరాఫ్‌గా కొత్తగూడెం నిలిచింది. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీతో తెలంగాణ ఖ్యాతి పెరగనుంది. ఈ సందర్భగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభాకర్ రావు విచారణపై సస్పెన్స్

మొదటి పేజీ తరువాయి

ఉన్నాయి. కాగా గత 14 నెలలుగా ప్రభాకర్ రావు అమెరికాలోనే తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ఆయన ఇండియాకు వస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడుగా ప్రభాకర్ రావు ఉన్న విషయం విధితమే. అమెరికా నుంచి బుధవారం రాత్రి ఆయన హైదరాబాద్ చేరుకోవచ్చని సమాచారం ఉంది. ఒక వేళ ఆయన రాక ఆలస్యమైతే మరుసటి రోజున న్యాయవాదులతో కలిసి సిట్ విచారణకు హాజరవుతారని తెలుస్తోంది. మరోవైపు ఇప్పటికే ప్రభాకర్‌రావు భార్య హైదరాబాద్ చేరుకున్నట్లు సమాచారం. కాగా ఎట్టకేలకు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావును విచారణ చేయడానికి సెట్ అధికారులకు లైన్ క్లియర్ అయింది. ప్రభాకర్ రావు వ్యవహారం, ఎన్నో మలుపుల మీద మలుపులు తిరిగింది. ఎట్టకేలకు ఆయన విచారణ కోసం హైదరాబాద్ వస్తున్నారు. కాగా ఆయన చేసుకున్న ముందస్తు బెయిలును హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీం కోర్టుకు వెళ్లారు.. అక్కడ ఊరట లభించింది.

# త్వరలోనే బాలికా రక్షక టీం

మొదటి పేజీ తరువాయి

అడ్వైజరీ కమిటీ నియమిస్తామని చెప్పారు. వారి సలహాలు సూచనలతో శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత పటిష్టపరుస్తామని వెల్లడించారు. బాలికల రక్షణ కోసం బాలికలతో స్నేహ కమిటీలను ఏర్పాటు చేస్తామనన్నారు. స్వీయ రక్షణ టీంలుగా స్నేహ కమిటీలు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు. అంగన్వాడీ టీచర్ల ద్వారా అమ్మాయిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కల్పిస్తామన్నారు. మహిళ, బాలికల భద్రత మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలను గుర్తించి అంగన్వాడీలను వారితో అనుసంధానం చేస్తామని అన్నారు. త్వరలో మహిళల హక్కుల మీద పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించి మహిళ భద్రత కోసం పటిష్ట విధానాలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు.

చాలా చోట్ల ముళ్ళ పొదల్లో, చెత్తకుప్పల్లో అప్పుడే పుట్టిన బిడ్డలను వదిలేసి వెళుతున్నారని.. చీమలు, కుక్కలు, చెత్త, ముండ్ల మధ్య శిశువుల ప్రాణాలు పోతున్నాయన్నారు. దీన్ని నివారించేందుకు వీలున్న చోట ఊయలలను ఏర్పాటు చేస్తామన్నారు. బిడ్డలను పారేయకుండా.. ఆ ఊయలలో వదిలేస్తే వారి బాధ్యతను తామే స్వీకరిస్తామని అన్నారు. తెలంగాణ ఏర్పాటై 10 సంవత్సరాలైనా ఇప్పటికీ బాల్య వివాహ నిరోధక చట్ట రూల్స్‌ను అడాప్ట్ చేసుకోకపోవడం బాధాకరమన్నారు. త్వరలో రూల్స్‌ను అడాప్ట్ చేసుకుంటామని ప్రకటించారు.

బాల్య వివాహాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ సభల్లో, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో బాల్య వివాహల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు. ఐసీడీఎస్ పథకాలకు తెలంగాణ ప్రాంతంలోనే బీజం పడిందన్నారు. 1972లో మహబూబ్‌నగర్‌లో ఫ్రీడమ్ ఫైటర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఐసీడీఎస్ ప్రారంభించారన్నారు. ఆ అనుభవాల ఆధారంగానే దేశవ్యాప్తంగా ఇందిరా గాంధీ ఐసీడీఎస్ స్కీంను విస్తరింపజేశారని తెలిపారు. అంగన్వాడీ సేవలకు ఆరాధ్యులుగా దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఇందిరా గాంధీ నిలిచారని చెప్పుకొచ్చారు. వారి ఆదర్శంగా అంగన్వాడీ సేవలను ప్రతి ఇంటికి చేర్చాలన్నారు.



ఈ ఏడాది వేయి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసి స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అంగన్వాడీ గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని.. కాబట్టి దేశ భవిష్యత్తును లిఖించేది అంగన్వాడీ సిబ్బంది అని తెలిపారు. కరీంనగర్‌లో ప్రతీ శుక్రవారం అంగన్వాడీ సిబ్బంది గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల అడ్మిషన్లను , హాజరును పెంచాలని మంత్రి ఆదేశించారు. ఆకాశాన్ని చీల్చుకొని అమ్మాయిలు అంతరిక్షానికి వెళ్లినా భూమి మీద కొన్నిసార్లు రక్షణ కరువవుతుందన్నారు. అందుకే అమ్మాయిల స్వీయ రక్షణ కోసం బాలికా రక్షక టీంలను ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మాయిలను వేధిస్తే సంఘ బహిష్కరణకు గురవుతారని హెచ్చరించారు. అమ్మాయిలను ముట్టుకుంటే కఠిన శిక్షలు తప్పవన్నారు. అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తిస్తే ఇలాంటి శిక్షలు అనుభవించాల్సి వస్తుందో అబ్బాయిలకు అవగాహన కల్పించాలని మంత్రి సీతక్క వెల్లడించారు.

# ఇంగ్లాండ్ క్లీన్‌స్వీప్
## ఏడు వికెట్ల తేడాతో గెలుపు



**వేద న్యూస్,**

వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు 3-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం రాత్రి జరిగిన మూడో, చివరి వన్డేలో ఇంగ్లండ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా 40ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన 246పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ జట్టు కేవలం మూడు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. జేమీ స్మిత్(64బీ 28బంతుల్లో) తొలి అర్ధసెంచరీకి తోడు డకెట్(58) తొలి వికెట్‌కు 93పరుగులు జతచేశారు. ఆ తర్వాత రూట్(44) బ్యాటింగ్‌లో రాణించగా.. కెప్టెన్ బ్రూక్(26), బట్లర్(41) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. విండీస్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఇంగ్లండ్ 29.4ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 246పరుగులు చేసి గెలిచింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌ను ఇంగ్లండ్ బౌలర్లు నిలువరించారు. ఆదిల్ రషీద్(3/40)కి తోడు మహమూద్, కర్సే, పోట్స్ రెండేసి వికెట్లతో కట్టడి చేశారు. వెస్టిండీస్ బ్యాటర్లలో మోటీ(61), రూథర్డ్‌ఫోర్డ్(70) అర్ధసెంచరీలతో రాణించగా.. జోసెఫ్(41) ఫర్వాలేదనిపించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జేమీ స్మిత్‌కు, సిరీస్ జో రూట్‌కు దక్కాయి.

# సెప్టెంబర్ 5న థాయ్ లాండ్‌తో భారత్ ఢీ


**వేద న్యూస్,**



ఆసియా కప్ మహిళల హాకీ టోర్నమెంట్ షెడ్యూల్ విడుదలైంది. చైనాలోని హాంగ్జౌ వేదికగా సెప్టెంబర్ 5 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. 10 రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో మొత్తం 8 జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. గ్రూప్-బిలో ఉన్న భారత మహిళల హాకీ జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను థారులాండ్‌తో తలపడనున్నట్లు హాకీ ఇండియా(హెచ్ఐ) బుధవారం వెల్లడించింది. గత ఎడిషన్‌లో కాంస్యం సాధించిన టీమిండియా ఈసారి స్వర్ణ పతకంపై గురి పెట్టింది. ఈ టోర్నీ విజేత 2026 మహిళల ఎఫ్ఐహెచ్ ప్రపంచకప్ నేరుగా అర్హత సాధించనుంది. ఈ టోర్నీలో ఆడే 8జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. పూల్-ఏలో చైనా, కొరియా, మలేషియా, చైనీస్ తైపీ ఉండగా.. పూల్-బిలో భారత్, జపాన్, సింగపూర్, థారులాండ్ జట్లు ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో భారత జట్టు థారులాండ్‌తో సెప్టెంబర్ 5న తలపడనుండగా.. 6న డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్, 8న సింగపూర్ తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీకి భారతజట్టు కెప్టెన్‌గా సలీమా టెటే ఎంపికైన విషయం తెలిసిందే. 2017లో చివరిసారిగా భారత జట్టు ఆసియా కప్ విజేతగా నిలిచింది.

# ఆర్‌సిబి విజయంలో కోహ్లి ముద్ర

**వేద న్యూస్,**



విరాట్ కోహ్లి సుదీర్ఘ కాలంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతనిథ్యం వహిస్తున్నాడు. ఈ క్రమంలో పలు సీజన్‌లలో ఆర్‌సిబికి సార థ్యం వహించాడు. పలుసార్లు జట్టును ఫైనల్‌కు కూడా తీసుకెళ్లాడు. అయితే ఐపిఎల్ ట్రోఫీ ని మాత్రం సాధించలేక పోయాడు. ప్రతి సీజన్‌లో భారీ ఆశలతో బరిలోకి దిగడం ఖాళీ చేతులతో తిరిగి రావ డం బెంగళూరుకు అలవాటుగా మారిపోయింది. ఈసారి కూడా ఆర్‌సిబి ట్రోఫీ సాధిస్తుందని ఎవరూ ఊహించలేదు. ఐపిఎల్‌లో బెంగళూరుకే అంకితమైన స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి వేరే ఆలోచనతో ఉన్నాడు. జట్టుకు ఈసారి ఎలాగైనా ట్రోఫీ సాధించి పెట్టాలని భావించాడు. పేరుకు రజత్ పటిదార్ కెప్టెన్‌గా ఉన్నా కోహ్లినే అన్ని తానై జట్టును ముందుకు నడిపించాడు. పటిదార్ ఎప్పటికప్పుడూ సలహాలు, సూచనలు ఇస్తూ అతనిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. తాను కూడా బ్యాట్‌తో జట్టుకు అండగా నిలిచాడు. జట్టులోని ప్రతి ఆటగాడిలో ధైర్యాన్ని నింపుతూ ముందుకు సాగాడు. బ్యాట్‌తో రాణిస్తూనే ఫీల్డ్‌లో సహచరులను ఉత్సాహపరుస్తూ కోహ్లి జట్టు ట్రోఫీ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అంతేగాక సుదీర్ఘ కాలంగా తనకు అందని ద్రాక్షగా ఉన్న ఐపిఎల్ ట్రోఫీ లోటును తీర్చుకున్నాడు.

# వార్మప్ మ్యాచ్‌లోనే అర్ధశతకం బాదేశాడుగా!

ముంబై ఇండియన్స్ తరపున ఐపీఎల్ 2025లో మెరిసిన రికెల్టన్, డబ్ల్యుటిసి ఫైనల్‌కు ముందు జింబాబ్వేతో వార్మప్ మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిశాడు. లార్డ్స్ వేదికగా ప్రారంభమయ్యే ఫైనల్‌కి అతను కీలక ఓపెనర్‌గా దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రోటీస్ జట్టు తమ విజయ అవకాశాలు మెరుగుపరచేందుకు లెజెండ్ స్టువర్ట్ బ్రాడ్‌ను కన్సల్టెంట్‌గా తీసుకుంది. రికెల్టన్ ఫామ్, బ్రాడ్ అనుభవం దక్షిణాఫ్రికా జట్టు ఆశల్ని మరింత పెంచుతున్నాయి. ఐపిఎల్ 2025లో మెరిసిన ముంబై ఇండియన్స్ ఆటగాడు ర్యాన్ రికెల్టన్, ఇప్పుడు ఐసిసి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ డబ్ల్యుటిసి ఫైనల్ 2025కి ముందు జింబాబ్వేతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో అద్భుతంగా అర్ధశతకం సాధించి ప్రోటీస్ జట్టుకు అతను ఎంత కీలకమో మరోసారి రుజువు చేశాడు. ఐపీఎల్‌లో తొలి సీజన్‌నే ఆడుతూ ?1 కోటి విలువైన రిక్రూట్‌గా ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ ఆర్డర్‌ను నడిపించిన రికెల్టన్, మొత్తం 14 మ్యాచ్‌లలో 388 పరుగులు చేసి మూడు అర్ధశతకాలు సాధించాడు. అత్యధికంగా 62లి స్కోరు నమోదు చేసిన ఈ ఎడమచేతి ఆటగాడు, 30 సగటుతో 150 స్ట్రైక్ రేట్‌తో ఆటను చక్కగా మలచాడు. ఈ ఐపిఎల్ ఫామ్‌ను కొనసాగిస్తూ, లార్డ్స్‌లో జింబాబ్వేపై జరిగిన వార్మప్ మ్యాచ్‌లో కూడా అర్ధశతకంతో మెరిశాడు. ప్రారంభ ప్రారంభంలో క్యాన్ డ్రాప్ అయినా, ఆ ఆనందాన్ని సద్వినియోగం చేసుకున్న రికెల్టన్ 62 పరుగులతో తన నైపుణ్యంతో సమర్థించుకున్నాడు.

వేద న్యూస్

శుక్రవారం జూన్ 06, 2025

# ‘ఫేషియల్’ అటెండెన్స్‌పై విముఖత

మొదటి పేజీ తరువాయి

దినదిన గండంగా మారింది. ఏ చిన్న పని చేసినా తమ వేతనాల నుంచి ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సెక్రెటరీలపైన మరింత భారం మోపేలా సర్కారు తీరు ఉందని కొందరు సెక్రెటరీలు వెల్లడిస్తున్నారు.

**– తలకు మించిన భారంతో.. కార్యదర్శులు సతమతం**

గత 16 నెలలుగా గ్రామ పంచాయతీల నిర్వహణకు సర్కారు నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. దానికి తోడు గత పది నెలలుగా చెక్కులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

దీంతో గ్రామపంచాయతీకి క్రెడిట్/అప్పు ద్వారా సామాగ్రిని ఇచ్చే దుకాణదారులు, సంస్థలు.. ఉద్దెరకు సామగ్రిని ఇవ్వడం లేదు. గ్రామాల్లో కార్యకలాపాల నిర్వహణకు ట్రాక్టర్లకు పెట్రోల్ బంకుల్లో డీజిల్ పోయడం లేదు. ఫలితంగా గ్రామ కార్యదర్శులు సొంతంగా అప్పులు తెచ్చి మరీ.. గ్రామపంచాయతీలను నిర్వహించవలసి వస్తోంది. దీంతో ఒక్కొక్క గ్రామ పంచాయతీ కార్యదర్శి కనీసంగా రూ.2 నుంచి 5 లక్షల వరకు గ్రామపంచాయతీ నిర్వహణకు ఖర్చు పెట్టుకుని ఉన్నారు.

**– ‘ఫేషియల్’ అటెండెన్స్‌తో ఆందోళన**

ఇప్పటికే తమ రోజువారి విధుల నిర్వహణలో పంచాయతీ సెక్రెటరీలు సతమతమవుతుండగా, ఇటీవల పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్.. తెలంగాణలో ఏ ఉద్యోగికి, ఏ శాఖకు లేనివిధంగా ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా మొబైల్ అటెండెన్స్ యాప్‌ను తీసుకొచ్చారు. దీంతో అది పంచాయతీ కార్యదర్శులకు ఆందోళన కలిగించే అంశంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు.. వారి వ్యక్తిగత అవసరాలకు కొనుక్కున్న




ఫోన్లలో ఇప్పటికే ప్రభుత్వానికి సంబంధించిన 10 వరకు యాప్‌లను నిర్వహిస్తున్నారు. తద్వారా వారి ఫోన్లు హ్యాంగ్ అయి పని చేయని పరిస్థితి నెలకొంది. దానికి అదనంగా ఇప్పుడు ఈ కొత్త ఫేషియల్ రికగ్నేషన్ యాప్ అనేది పంచాయతీ కార్యదర్శుల ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని.. తద్వారా రోజువారి అటెండెన్స్ తీసుకోవాల్సిందిగా పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా రోజువారీగా ఇంటింటికి వచ్చే తడి, పొడి చెత్త కిలోలల్లో జోకి అట్టి సమాచారం యాప్‌లో నిక్షిప్తం చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో చెత్త సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్ట్) యాప్‌పైనా కార్యదర్శులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖతో పాటు గ్రామంలో అమలయ్యే అన్ని శాఖల పనులను తామే పర్యవేక్షిస్తామని, పనుల వివరాలను ఇచ్చిన సమయంలోనే యాప్‌లో అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదని కొందరు సెక్రెటరీలు వెల్లడిస్తున్నారు.

**– జీపీల్లో నిధులు, సిబ్బంది కొరత**

ఈఒకవైపు పంచాయతీల్లో నిధులు, సిబ్బంది కొరత ఉండగా, మరోవైపు ఇప్పటికీ 2011 జనాభా లెక్కల ప్రకారమే 500 జనాభాకు ఒక సిబ్బంది లెక్క ఆనాటి ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ ఇందులో ఒకరు పూర్తిగా ట్రాక్టర్ డ్రైవింగ్‌కు పరిమితమవుతున్నారు. మరొకరు కేవలం తాగునీటి నల్లాల నిర్వహణకు మాత్రమే సరిపోతున్నారు. పెద్ద గ్రామంలో అయితే ఒకరు కేవలం ఎలక్ట్రీషియన్ వర్క్‌కు మాత్రమే సరిపోతున్నారు. అలాంటప్పుడు ఇంటింటికీ తడి, పొడి చెత్త కిలోల చొప్పున జోకి నమోదు చేసి నిర్వహించే అంత సామగ్రి, మ్యాన్ పవర్ గ్రామపంచాయతీ వద్ద లేదని సెక్రెటరీలు పేర్కొంటున్నారు. డైరెక్టర్ ఆదేశించినట్టు పనులు పూర్తిస్థాయిలో అమలు కావాలంటే ప్రతి 100 మంది జనాభాకు ఒక సిబ్బందిని ప్రత్యేకంగా ఇవ్వాలని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌ను కోరుతున్నారు. కార్యదర్శుల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోకుండా.. నయా పైసా రిలీజ్ చేయకుండా సర్కారు చేపట్టే పలు కార్యక్రమాలను విజయవంతం చేయాలంటూ.. కార్యదర్శుల మెడపై కత్తిపెట్టి పని చేయించడం సరికాదని కొందరు విమర్శిస్తున్నారు.

**– సైబర్ నేరస్తుల వలలో చిక్కే చాన్స్**

రాష్ట్రంలో ఏ ఉద్యోగికి లేనివిధంగా తమకే ఫోన్ ద్వారా ఫేషియల్ రిజర్వేషన్ యాప్ ఎందుకని సెక్రెటరీలు ప్రశ్నిస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌ను తమ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయడం వల్ల తమ వ్యక్తిగత సమాచారం థర్డ్ పార్టీకి వెళ్లే చాన్స్ ఉందని, తద్వారా మహిళా కార్యదర్శులు.. సైబర్ నేరగాళ్ల చేతుల్లో బలయ్యే అవకాశం ఉందని పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌కు సెక్రెటరీలు విన్నవించుకుంటున్నారు.

## సెక్రెటరీలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలి

**జనుగాని అశోక్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు**



కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కోరుతున్నా. గతేడాది అక్టోబర్ నుంచి ఆదివారాలు, సెలవులు, పండుగలు అనే తేడా లేకుండా పనులు చేయించడంతో కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు. సొంతంగా జేబుల నుంచి పెట్టిన డబ్బులు ఇప్పించాలని ప్రభుత్వాన్ని రిక్వెస్టు చేస్తున్నా. 18 నెలలుగా గ్రామపంచాయతీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం నుంచి ఫండ్స్ రిలీజ్ కావడం లేదు. సర్పంచుల పదవీ కాలం ముగిసి 15 నెలలు గడిచింది. అప్పటి నుంచి కార్యదర్శులే గ్రామాల్లో పాలనా వ్యవహారాలను సాగిస్తున్నారు. ఓ వైపు పని భారం.. మరో వైపు యాప్‌లలో సమాచారం నిక్షిప్తం చేయడం.. ఫలితంగా చాలా మంది కార్యదర్శులు ఇబ్బందులకు గురవుతున్నారు.

## ఆర్థిక భారం నుంచి విముక్తి కల్పించాలి

**ఇంజపెల్లి నరేశ్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం హనుమకొండ జిల్లా కార్యదర్శి**



గ్రామ పంచాయతీల నిర్వహణకు వెంటనే నిధులు విడుదల చేసి కార్యదర్శులకు ఆర్థికభారం నుంచి విముక్తి కల్పించాలి. పెండింగ్ బిల్లులు రిలీజ్ చేయాలి. ప్రభుత్వం ఏ శాఖలో లేనివిధంగా ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా అటెండెన్స్ పెట్టి కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలి. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం ఆర్థిక సంఘం గ్రాంటును నిలిపివేసింది. పారిశుధ్య పనులు, సింగిల్ ఫేజ్ మోటార్లకు ట్యాంకులు అమర్చడం, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, వీధిదీపాల నిర్వహణ తదితర పనులకు కార్యదర్శులే సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది.

# బొడ్రాయి ఉత్సవాలకు ఉదయ్ నందన్ రెడ్డి విరాళం

**వేద న్యూస్, వీణవంక:**



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బొంతుపల్లి గ్రామంలో భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి పోచమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ఈ ఉత్సవాలకు యప్‌టీవీ, టురిటో ఫౌండర్, సీఈవో పాడి ఉదయ్ నందన్ రెడ్డి విరాళంగా రూ.20 వేలు అందజేశారు. ఆ నగదుకు సంబంధించిన చెక్కును ఉదయ్ నందన్ రెడ్డి అనుచరులు బొంతపల్లి గ్రామప్రజల మహత్తరమైన ఉత్సవానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బొంతుపల్లి గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాడి ఉదయ్ నందన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వీణవంక మాజీ జడ్పిటిసి దసారపు ప్రభాకర్, మహంకాళి రాజ్ కుమార్ , చదువు మహేందర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, జున్నుతుల జనార్ధన్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే శత శాతం ఉత్తీర్ణత

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



ప్రభుత్వ బడుల్లోనే వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా,మండల స్థాయిలో ర్యాంకులు సాదించబడుతుందని ప్రధానోపాధ్యాయులు సైది రెడ్డి,వాసు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంకుడొత్ పాండు నాయక్ లు అన్నారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మాటూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి పలువురు విద్యార్దులను పాఠశాలలో నమోదు చేయించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదవి ట్రిపుల్ ఐటీ,సిఓఈలో పలువురు విద్యార్దులు సీట్లు సాధించారని గుర్తు చేశారు.అనేక మంది విద్యారులు ప్రభుత్వ పాఠశాలలో చదవి ఉన్నత ఉద్యోగాలు,ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదవి విద్యార్దులు భవిష్యత్ లో ప్రభుత్వం వివిధ కోర్సుల్లో చేరడానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ,సైదయ్య, మాలోత్ దశరథ్నాయక్ ,శ్రీనివాస్, విజయలక్ష్మి, నరేందర్, ఝాన్సి, లలిత తో పాటు విద్యార్దులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# సస్పెన్షన్ @ మిల్స్ కాలనీ!?

మొదటి పేజీ తరువాయి

ఏండ్లుగా స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్‌వో)గా బాధ్యతలు చేపట్టిన వారిలో మెజారిటీ అధికారులు ఏ ఆరోపణ లేకుండా ట్రాన్స్‌ఫర్ కాలేదని చెప్పొచ్చు. సాధారణ బదిలీలో భాగంగా ఈ పీఎస్ నుంచి వెళ్లిన వారు అరుదుగా ఉండటం గమనార్హం. ఈ పీఎస్ ఎస్‌హెచ్‌వోలుగా పని చేసిన ఆఫీసర్లలో ఎక్కువ మంది ఏదో ఒక ఆరోపణ మోస్తూ.. సస్పెండయి వెళ్లిన వారే తప్ప నిజాయితీగా పని చేసి బదిలీపై వెళ్లినవారు అరుదు అని చెప్పకతప్పదు మరి.. ప్రస్తుతం ఏ.జే.మిల్స్ కాలనీ పీఎస్ సీఐ పోస్టు ఖాళీగా ఉండగా, నూతనంగా రాబోయే ఇన్‌స్పెక్టర్ గత చరిత్రను పక్కనబెట్టి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలని, ప్రజల అధికారిగా పని చేయాలని జనం ఆకాంక్షిస్తున్నారు. పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు లా అండ్ ఆర్డర్ కంట్రోల్ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించి.. జనం మనసులో స్థానం పొందేలా పని చేస్తే.. ఈ పీఎస్‌కు చక్కటి పేరు వస్తుందని, నూతన చరిత్ర లిఖితమవుతుందని పలువురు నగరవాసులు పేర్కొంటున్నారు.

**– ఇప్పటివరకు ఏ.జే మిల్స్ కాలనీ పీఎస్‌లో సీఐగా విధులు నిర్వహించిన ఆఫీసర్లు**

**జీ.వేణు 11-10-2025 నుంచి 22-10-2016**
**పీ.తిరుమల్ 01-02- 2017నుంచి05-09-2017**
**బీ.నందిరామ్ 07- 09-2017 నుంచి 07-09-2018**
**పీ.దయాకర్ 07-09- 2018 నుంచి 22-02-2019**
**టీ.సత్యనారాయణ 22-02-2019 నుంచి 03-10-2019**
**డీ.నరేశ్ కుమార్ 03-10-2019 నుంచి 02-10-2020**
**జే.రవికిరణ్ 02-10-2020 నుంచి 01-09-2021**
**ఎం.శ్రీనివాస్ 01-09-2021 నుంచి 28-07-2023**
**టీ.సురేశ్ 28-07- 2023 నుంచి 08-02-2024**
**పి.మల్లయ్య 08-02-2024 నుంచి 24-09-2024**
**జే.వెంకటరత్నం 08-10-2024 నుంచి 10-05-2025**

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం




మొదటి పేజీ తరువాయి

వం” సందర్భంగా రైతు వేదిక నుండి పల్లె ప్రకృతి వనం వరకు నిర్వహించిన ర్యాలీను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి, గ్రామస్తుల్లో పర్యావరణ పరిరక్షణకు పాటించాల్సిన నియమాల గురించి సూచించారు. అనంతరం మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో జలకాలుష్యం ఏర్పడి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అం దరిపై ఉందన్నారు. కాలుష్య నివారణకు ప్లాస్టిక్ నిషేధం పాటించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలను నాటి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ కౌసల్యాదేవి, ఎంపిడిఓ రవీందర్, ఏపీఎం కిషన్, మహిళలు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073